క్లుప్తంగా

కె.జె.పురంలో ఘనంగా బల్లల పండగ

మాడుగుల రూరల్: కె.జె.పురంలో రజకుల బల్లలు పండగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏటా సంక్రాంతి పండగ తర్వాత చాకిరేవు వద్ద భక్తి ప్రవత్తులతో ఈ పండగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. దీనిలో భాగంగా రజకులు పసుపుకుంకుమ, బ్యాండు మేళాలతో ఊరేగింపుగా పెద్ద చెరువులో చాకిరేవు వద్దకు వెళ్లి అక్కడ బల్లలకు పూజలు చేశారు.

జిల్లా స్థాయి కబడ్డీ పోటీల విజేత కె.జె.పురం



బహుమతులు అందజేస్తున్న గౌరీపరమేశ్వర భజన సేవా బృందం సభ్యులు

మాడుగుల రూరల్: మహా శివరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని కె.జె.పురం శివాలయం వద్ద జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో కె.జె.పురం జట్టు విజేతగా నిలిచింది. ఈ పోటీల్లో విశాఖ, అనకాపల్లి జిల్లాల నుంచి 25 జట్లు శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు హోరాహోరీగా తలపడ్డాయి. ప్రథమ బహుమతి కె.జె.పురం జట్టుకు రూ. 10 వేలు, ద్వితీయ, తృతీయ బహుమతులు బుచ్చెయ్యపేట జట్టుకు రూ. 8 వేలు, విశాఖపట్నం జట్టుకు దక్కాయి. ఆదివారం తెల్లవారుజామున గౌరీపరమేశ్వర భజన సేవా బృందం సభ్యులు, గ్రామ పెద్దలు బహుమతులు ప్రదానం చేశారు.

రోగుల పట్ల నిర్లక్ష్యం వద్దు



పీహెచ్‌సీని సందర్శించిన ఎంపీపీ

మాకవరపాలెం: రోగుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దని ఎంపీపీ రుత్తల సత్యనారాయణ వైద్య సిబ్బందికి సూచించారు. బూరుగుపాలెం పీహెచ్‌సీని ప్రారంభించిన నాటి నుంచి ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకే సేవలందించేవారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వారం రోజుల క్రితం 24/7 పనిచేసేలా అప్‌గ్రేడ్ చేసింది. దీంతో ఆదివారం రాత్రి ఎంపీపీ సందర్శించారు. అక్కడ సిబ్బందితో మాట్లాడారు. నిత్యం రోగులకు అంగుబాటులో ఉంటూ రేయింబవళ్లు సక్రమంగా సేవలు అందేలా చూడాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదన్నారు.

మిరపలో నల్ల తామర పురుగు

రాంబిల్లి : మిరప పంటను నల్ల తామర పురుగు ఆశించినట్టు హరిపురం కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. పలు గ్రామాల్లో మిరప పంటను పరిశీలిస్తే నల్ల తామర పురుగు ప్రభావం కనిపించిందన్నారు. రైతులు సకాలంలో ఈ పురుగు నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పురుగు పూత దశలో రసం పీల్చివేయడం ద్వారా పిందె కట్టకుండా చేస్తుందన్నారు. మిరపతో పాటు పెసర, మినుము పంటల్లో కూడా ఈ నల్ల తామర పురుగు కనిపించినట్టు పేర్కొన్నారు. ఎకరాకు 8 కిలోల చొప్పున ఫిప్రోనిల్ గుళికలను తగినంత తేమ ఉన్నప్పుడు వేసుకోవాలన్నారు. ఎకరాకు 10 పసుపు రంగు, 10 నీలం రంగు జిగురు అట్టలను పొలంలో కట్టాలని సూచించారు. అవసరం బట్టి 2 మిల్లీ లీటర్ల ఫిప్రోనిల్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే ప్రయోజనం ఉంటుందన్నారు.

వ్యవసాయ సామగ్రి పంపిణీ

పాడేరు రూరల్: డి.గొందూరు పంచాయతీ వాకపల్లిలో ఆదివారం గిరిజనులకు వ్యవసాయ పనిముట్లు అందజేశారు. విశాఖపట్నానికి చెందిన చేయూత ఫౌండేషన్, లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్ సహకారంతో గిరి రైతులకు గునపం, పార, గమేలా వంటి వ్యవసాయ సామగ్రితో పాటు దుప్పట్లు, చీరలు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన వైద్య శిబిరంలో 150 మంది గిరిజనులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. వ్యసనాలకు దూరంగా ఉండి ఆరోగ్యమైన జీవితం గడపాలని స్పందన చేయూత చైర్మన్ ఊపురి బుచ్చిరాజు సూచించారు. ఏజెన్సీ ప్రాంతంలో స్పందన ఫౌండేషన్ సంస్థ సేవలు మరింత విస్తరింపజేయాలని సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు కోరారు.

కోలాహలంగా ఉత్తరవాహిని

- పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు
- ఘనంగా ముగిసిన శివరాత్రి జాగారం
- తెల్లవారుజాము వరకు ఏకాహం
- ఆకట్టుకున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలు



నర్సీపట్నం : పాకలపాడు గురుదేవులను దర్శించుకుంటున్న భక్తులు



మాడుగుల:జంపెన శివాలయంలో బారులుతీరిన భక్తులు



నర్సీపట్నం : ఉత్తరవాహనిలో స్నానాలు చేస్తున్న భక్తులు



బుచ్చెయ్యపేట: మంగళాపురంలో గౌరీపరమేశ్వర్లను ఊరేగిస్తున్న సర్పంచ్ వెంకట పద్మరేఖ



మాడుగుల రూరల్: కె.జె.పురం శివాలయం వద్ద ఆకట్టుకున్న అఖండ దీపార్చన

నర్సీపట్నం: బలిఘట్టం బ్రహ్మలింగేశ్వరస్వామిని దర్శించుకునేందుకు రెండో రోజున భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దీంతో ఉత్తరవాహిని, బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయ దారులు రద్దీగా మారాయి. ఆదివారం వేకువజామునే ఉత్తరవాహినిలో భక్తుల కోలాహలం నెలకొంది. ఏటా మహా శివరాత్రి మరుసటి రోజున ఉత్తరవాహినిలో అమావాస్య స్నానాలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. శనివారం రాత్రి దారమఠం, కల్యాణపులోవలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు జాగారం చేసి తెల్లవారుజామున బలిఘట్టం తరలివచ్చి ఉత్తరవాహినిలో స్నానాలు ఆచరించి బ్రహ్మలింగేశ్వరస్వామికి పూజలు నిర్వహించారు. ఉత్తవాహినిలో పాకలపాడు గురుదేవుల ఆశ్రమం, ఆలయం భక్తులతో కోలాహలంగా మారింది. పుణ్యస్నానాలకు వచ్చిన దంపతులకు బ్రహ్మణులు బ్రహ్మముడులు వేసి ఆశీర్వచనాలు అందించారు. అనంతరం బ్రహ్మలింగేశ్వరుని ఆలయంలో అభిషేకాలు జరిపించుకున్నారు. పాకలపాడు గురుదేవుల ఆశ్రమం భక్తులతో కిటకిటలాడింది. పుణ్యస్నానాలు ఆచరించిన భక్తజనం గురుదేవులను దర్శించుకున్నారు. ఆశ్రమం అవరణలోనున్న శివలింగానికి పూజలు నిర్వహించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులకు ఆశ్రమ నిర్వాహకులు అల్పాహారంతో పాటు భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సత్యనారాయణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పుణ్యస్నానాలు ఆచరించే ఘాట్లు, పరిసర ప్రాంతాల్లో ప్లాస్టిక్ కవర్లు తీసుకురాకుండా మున్సిపల్ కమిషనర్ కె.కనకారావు పటిష్ట చర్యలు తీసుకున్నారు.

ఆకట్టుకున్న కోలాటం

మాడుగుల రూరల్: మహా శివరాత్రి ఉత్సవాలు ఆదివారం తెల్లవారుజాముతో ముగిశాయి. శనివారం రాత్రి కె.జె.పురం, జంపెన, తదితర శివాలయాల్లో రుద్రాభిషేకం నిర్వహించారు. ఆయా ఆలయాల్లో అఖండ నామ శివనామస్మరణ ఆదివారం తెల్లవారుజాము 5 గంటలు వరకు నిర్వహించారు. కె.జె.పురం శివాలయం వద్ద మహిళల కోలాటం, తోడపెద్దు సేవా కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆలయానికి వచ్చిన భక్తులకు లక్కీ డ్రా తీసి సోమవారం 20 మందికి ఉచితంగా చీరలు అందజేయనున్నట్లు గౌరీపరమేశ్వర భజన సేవా బృందం సభ్యులు తెలిపారు.

మాడుగుల: స్థానిక ఉబ్బలింగేశ్వర, శ్రీకృష్ణభూపాలేశ్వర, భీమలింగేశ్వర స్వామి, జంపెన గుప్తలింగేశ్వర స్వామి ఆలయాల్లో రెండో రోజు భక్తులు పోటెత్తారు. పెద్దేరు, పాల గెడ్డ నదుల్లో పుణ్యస్నానాలు చేసి శివాలయాలను దర్శించుకున్నారు. ఆలయాల కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కె.కోటపాడు: మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని భక్తుల జాగారాలు ముగిశాయి. కె.కోటపాడు భీమలింగేశ్వరాలయం, లంకవానిపాలెం గృహలింగేశ్వరాలయం, చౌడువాడ కాశీవిశ్వేశ్వరాలయం, ఆనందపురం మల్లికార్జునస్వామి, ఎ.కోడూరు భ్రమరాంబికా సహిత మల్లికార్జునస్వామి ఆలయాల్లో భక్తులు ఉదయం నుంచే పెద్ద ఎత్తున బారులు తీరారు. ఆయా ఆలయాలన్నీ శివనామస్మరణతో మార్మోగాయి.

దేవరాపల్లి: మహా శివరాత్రి జాగారణ పూర్తి చేసిన భక్తులంతా శారదా నదిలో పుణ్య స్నానాలను ఆచరించారు. అనంతరం శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. దేవరాపల్లి వనదేవీశ్వర, తిమిరాం ఉమామహేశ్వర స్వామి, బి. కింతాడ, వేచలం, ఎం. అలమండ, పెదనందిపల్లి భ్రమరాంబిక మల్లికార్జున స్వామి, చిననందిపల్లి ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయాల్లో భక్తుల తాకిడి నెలకొంది. ఈ సందర్భంగా శివునికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించి, శివనామ స్మరణతో తరించారు. దేవరాపల్లిలో ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, భాస్కరరావు, దంపతులు, తిమిరాంలో జెడ్పీటీసీ కర్రి సత్యం దంపతులు, బి. కింతాడలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు దంపతులు పూజలు చేశారు.

మర్రిపాలెం శివాలయం వద్ద అన్నదానం

నాతవరం: మహా శివరాత్రి సందర్భంగా మర్రిపాలెం శివాలయం వద్ద 24 గంటల పాటు మహిళలు భజనలు చేశారు. ఇక్కడ మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. అదే విధంగా మండలంలోని పలు శివాలయాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.



బుచ్చెయ్యపేట: వడ్డాది రామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు

బుచ్చెయ్యపేట: మహా శివరాత్రి ఉత్సవాలను శివాలయాల్లో ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి శివరాత్రి జాగారాలు చేసిన పలువురు భక్తులు ఆదివారం తెల్లవారు జాము నుంచి పుణ్య స్నానాలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. శారదానది, బొడ్డేరు, తాచేరు, గుర్రపుగెడ్డ తదితర పుణ్యనదుల్లో స్నానాలు చేయగా, మరికొంత మంది కల్యాణలోవ, పూడిమడక, బలిఘట్టం తదితర దూరప్రాంతాల్లో నదులకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. వడ్డాది, ఫంగిడి, మంగళాపురం, విజయరామరాజుపేట, గంటికొర్లాం, కొత్తూరు, దిబ్బిడి, రాజాం తదితర గ్రామాల్లో మూడు రోజుల పాటు మహా శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. కొత్తూరు సింహబలుడు కొండపై వెలిసిన శివాలయంలో కల్యాణ వేడుకలతో పాటు దిబ్బిడి, మంగళాపురం గ్రామాల్లో గౌరీ పరమేశ్వర్ల ఊరేగింపు ఉత్సవం ఘనంగా నిర్వహించారు.



మాడుగుల రూరల్: కోలాటం గ్రూపు సభ్యురాలు కాళ్ల మాధవిని సన్మానిస్తున్న దృశ్యం



కె.కోటపాడు శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



దేవరాపల్లి: శివాయంలో భక్తుల తాకిడి



నాతవరం: మర్రిపాలెంలో అన్నదానం చేస్తున్న మహిళా భక్తులు

గొలుగొండ: దారమఠం శివాలయం వద్ద రెండో రోజు భక్తుల తాకిడి నెలకొంది. ఆలయం వద్ద భక్తులకు ఇబ్బందులు లేకుండా కమిటీ సభ్యులు, పోలీస్ అధికారులు అన్ని చర్యలు చేపట్టారు. ఇక్కడ పది వేల మంది భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. కృష్ణదేవిపేట ఆలయానికి భక్తులు అధికంగా వచ్చారు.

వేడుకగా పోతురాజుబాబు ఉత్సవాలు



కొండపాలెంలో పోతురాజుబాబుకు పూజలు చేస్తున్న భక్తులు

రోలుగుంట: మండలంలో పలు గ్రామాల్లో పోతురాజుబాబు ఉత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఆలయాలకు భక్తులు వెళ్లి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. రోలుగుంటలో మద్దు ఎర్రోడు, అచ్చియ్య, వల్లయ్య పాకల వద్ద ఆలయాల్లో వారి కుటుంబీకులు ఈ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలు కొండపాలెం, జె.నాయుడుపాలెం గ్రామాల్లోనూ నిర్వహించారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు పోటీలు

కొండపాలెంలో పోతురాజుబాబు ఉత్సవం సందర్భంగా ఆదివారం జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు పోటీలను నిర్వహించారు. మాడుగుల, రోలుగుంట, చీడికాడ మండలాల నుంచి ఆరు బళ్లు పాల్గొన్నాయి. ఎం.కొత్తపల్లికి చెందిన నంబారు రాజబాబు ప్రథమ బహుమతిగా రూ.10 వేలు, ఎం.కొత్తపల్లికి చెందిన పరదేశమ్మకు ద్వితీయ బహుమతిగా రూ. 8 వేలు, కె.ఎల్.బి.పట్నానికి చెందిన గండి ఆనంద్‌కు తృతీయ బహుమతిగా రూ 6 వేలు, కొండపాలెం గ్రామానికి నుంచి రైతు ఎడ్లబండికి నాల్గో బహుమతిగా రూ.4 వేలు చొప్పున సర్పంచ్ బంటు లక్ష్మి, ఉప సర్పంచ్ చిరంజీవి ప్రదానం చేశారు. బంటు మోహన్, కర్రి శ్రీను మారుతి లోవరాజు, పోతు గణేష్, బద్ది రాము పాల్గొన్నారు.



కొండపాలెం చాకలి చెరువు వద్ద ఎడ్లబళ్ల పోటీ

మామిడిపాలెంలో

మాకవరపాలెం: మామిడిపాలెంలో పోతురాజు బాబు పండగను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ గ్రామంలో ఏటా ఈ పండగను ఘనంగా నిర్వహిస్తుంటారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం నుంచి గ్రామస్తులు పోతురాజుబాబు ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. రాత్రికి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

జీవితాంతం సీఎంకు రుణపడి ఉంటా

- రాష్ట్ర క్రియేటివ్ కల్చర్ కమిషన్ జోగినాయుడు

నాతవరం: తాను జీవితాంతం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటానని ఏపీ క్రియేటివిటీ అండ్ కల్చర్ కమిషన్ క్రియేటివ్ హెడ్ ఎల్. జోగినాయుడు తెలిపారు. ఆయన ఆదివారం విశాఖపట్నంలో టీటీడీ దేవస్థానం చైర్మన్, పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం డిప్యూటీ సీఎంలు బూడి ముత్యాలనాయుడు, పీడిక రాజన్నదొర, డిప్యూటీ స్పీకరు కోలగట్ల వీరభద్రస్వామి, మంత్రి బొత్సా సత్యనారాయణ, ఎమ్మెల్యేలు పెట్ల ఉమా శంకర్ గణేష్, తిప్పల నాగిరెడ్డి, చెట్టి పాల్గుణ, ధర్మాన కృష్ణదాస్, మేయర్ హరి వెంకటకుమారి, డీసీసీబీ చైరపర్సన్ చింతకాయల అనితసన్యాసిపాత్రుడు, వెలమ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ నెక్కల నాయుడు బాబులను వేర్వేరుగా కలిశారు. ఈ సందర్భంగా జోగినాయుడు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి క్రియాశీలకంగా పనిచేస్తున్నానన్నారు. తాను ఏనాడూ పదవులు ఆశించలేదన్నారు. ఇటీవల నర్సీపట్నం సీఎం పర్యటనలో తనతో ఆప్యాయంగా మాట్లాడి విజయవాడ రావాలని చెప్పారన్నారు. ఇప్పుడు పదవి ఇచ్చి సినీ పరిశ్రమకు మరోసారి పెద్దపీట వేశారన్నారు. తనపై ఎంతో నమ్మకంతో పదవి ఇచ్చినందుకు సీఎం జగన్‌కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.



టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న రాష్ట్ర క్రియేటివ్ కల్చర్ కమిషన్ జోగినాయుడు

పదిలో మెరుగైన ఫలితాలకు 'కృషి'

- ఉపవిద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్

ఎస్.రాయవరం : పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి-50 రోజుల కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని ఉపాధ్యాయులు చెప్పన్నారు. అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశాల మేరకు ఫిబ్రవరి 13 నుంచి 50 రోజులు పాటు ఉన్నత పాఠశాలల్లో టెన్త్ విద్యార్థులకు అదనపు తరగతులు, వారాంతపుపరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం స్థానిక ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్, సైన్స్ పరీక్షలు నిర్వహించారు. ఆదివారం సెలవురోజైనప్పటికీ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఉపాధ్యాయులు బోధనపై దృష్టి సారించడంపై తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



పరీక్షల నిర్వహణ తీరును పరిశీలిస్తున్న ఉపవిద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్

పాయకరావుపేట: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, కేహెచ్ వాడ ఉన్నత పాఠశాలలను ఉపవిద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్ ఆదివారం సందర్శించారు. కృషి కార్యక్రమంలో భాగంగా ఆదివారం జరిగిన ఇంగ్లిష్, సైన్స్ పరీక్షల నిర్వహణను పరిశీలించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, విద్యార్థులకు తగు సూచనలు, సలహాలు అందించారు.

అభయాంజనేయస్వామి తీర్థం గోడపత్రిక విడుదల



గోడ పత్రికను విడుదల చేస్తున్న బూడి

చీడికాడ: జి.కొత్తపల్లిలో ఈ నెల 21న నిర్వహించనున్న అభయాంజనేయ స్వామివారి తీర్థం గోడపత్రికను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆదివారం విడుదల చేశారు. తారువలో ఆయన్ను జి.కొత్తపల్లి వైఎస్సార్‌సీపీ నేతలు కలిసి మంగళవారం జరిగే తీర్థానికి హాజరు కావాలని కోరారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీ



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఏడువాక సత్యారావు

చోడవరం రూరల్: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా గోవాడలో శనివారం రాత్రి ముగ్గుల పోటీ నిర్వహించారు. మహిళలు, యువతులు పాల్గొని పోటాపోటీగా రంగు రంగుల ముగ్గులు వేసి ఆహూతులను అలరించారు. గ్రామానికి చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన ఈ పోటీల్లో సీనియర్, జూనియర్ విభాగాలుగా విజేతలకు వరుసగా మూడు, రెండు, వెయ్యి రూపాయల చొప్పున బహుమతులను చోడవరం మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక వెంకట సత్యారావు ప్రదానం చేశారు. ఈ పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. శివరాత్రి జాగరణ సమయంలో కోలాటాల ప్రదర్శన ఆకట్టుకుంది.

23న రోటరీ క్లబ్ ఆవిర్భావ దినోత్సవం

అనకాపల్లి టౌన్: రోటరీ క్లబ్ 118వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈ నెల 23న నిర్వహించనున్నట్లు అనకాపల్లి రోటరీ క్లబ్ ప్రాజెక్టు చైర్మన్ కడిమిశెట్టి సతీష్, క్లబ్ అధ్యక్షుడు సానా త్రినాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు గాంధీనగరం జీవీఎంసీ హైస్కూల్, భీమునిగుమ్మం హైస్కూళ్లలో పదోతరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తామన్నారు.

తారురోడ్డు పనుల పరిశీలన

చీడికాడ: డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చొరవతో మాడుగుల నియోజకవర్గంలో గ్రామీణ రోడ్లకు మహర్దశ వచ్చిందని జెడ్పీ స్త్రీ, శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్, కె.కోటపాడు జెడ్పీటీసీ ఈర్లె అనురాధ తెలిపారు. ఆదివారం ఆమె చెట్టుపల్లి కాటా నుంచి పెదగోగాడ రోడ్డు వరకు నిర్మిస్తున్న తారురోడ్డు పనులను పరిశీలించారు. ఆమె వెంట చీడికాడ, దేవరాపల్లి మండలాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు గొల్లవిల్లి రాజుబాబు, బూరె బాబూరావు, పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు గొల్లవిల్లి స్వామినాయుడు, మహిళా విభాగం దేవరాపల్లి అధ్యక్షురాలు రొంగలి నారాయణమ్మ, పార్టీ నేతలు పాతాళం చిన్నంనాయుడు, తుంపాల శ్రీను, కాటపాము పెదనాయుడు పాల్గొన్నారు.



రోడ్డు పనులు పరిశీలిస్తున్న జెడ్పీటీసీ అనురాధ తదితరులు

పేదలకు దుప్పట్లు, తలదిండ్లు పంపిణీ



పేదలకు దుప్పట్లు, తలదిండ్లు పంపిణీ చేస్తున్న ఎంవీఆర్ ట్రస్టు చైర్మన్ తనయుడు సంజుబాబు

రోలుగుంట: కుసుర్లపూడి మాజీ సర్పంచ్ సేవలకు తమ సహకారం ఎల్లవేళలా ఉంటుందని ఎంవీఆర్ ట్రస్ట్ చైర్మన్ తనయుడు సంజుబాబు తెలిపారు. కుసుర్లపూడి సమీపంలో పాకలపాడు గురువు ఆశ్రమం వద్ద మహా శివరాత్రోత్సవాలను నిర్వాహకుడు సింహాద్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో శని, ఆదివారాలు నిర్వహించిన భజన పోటీల్లో వివిధ మండలాల నుంచి 50 భజన బృందాలు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభ చూపాయి. ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పేదలకు దుప్పట్లు, తలదిండ్లు సంజుబాబు పంపిణీ చేశారు. అనంతరం ఇక్కడ అన్నసమారాధన నిర్వహించారు. మాజీ సర్పంచ్ గండి తాతాజీ, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి గుర్రపు పరుగు పందేల విజేత దేవరాపల్లి



పందెంలో విజేతకు నగదు బహుమతి అందిస్తున్న సర్పంచ్ దేముళ్లు

కె.కోటపాడు: జిల్లా స్థాయి గుర్రపు పరుగు పందేలు ఉత్సాహంగా సాగాయి. ఆదివారం గుల్లేపల్లిలో సీతారాముల తీర్థం సందర్భంగా నిర్వహించిన ఈ పోటీలను సర్పంచ్ బండారు దేముళ్లు జెండా ఊపి ప్రారంభించారు. ప్రథమ స్థానంలో దేవరాపల్లికి చెందిన మాధురి కాళి గుర్రం, ద్వితీయ స్థానంలో ఆర్.ఆర్.పేటకు చెందిన నూక అప్పారావు గుర్రం, తృతీయ స్థానంలో గవరవరానికి చెందిన మోదమాంబ బసంతి గుర్రం, నాల్గో స్థానంలో దేవరాపల్లికి చెందిన నవీన్ చెర్రి గుర్రం, ఐదో స్థానంలో అనకాపల్లికి చెందిన జోషిత్ గుర్రం, ఆరో స్థానంలో మునగపాకకు చెందిన వాయుపుత్ర గుర్రం, ఏడో స్థానంలో రాజమండ్రికి చెందిర రవి గుర్రం, ఎనిమిదో స్థానంలో పెద్దాపురానికి చెందిన అభయాంజనేయ గుర్రం, తొమ్మిదో స్థానంలో విశాఖపట్నంకు చెందిన అబ్బాస్ గుర్రం నిలిచాయి. నిర్వాహకులు నగదు పురస్కారాలు ప్రదానం చేశారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఉదయం సీతారాముల ఆలయంలో గ్రామస్తులు పూజా కార్యక్రమాలు చేశారు.



పందెంలో దౌడు తీస్తున్న గుర్రం

అంధుల పాఠశాలకు నిత్యావసరాల పంపిణీ



అంధులకు నిత్యావసర సరకులు అందజేస్తున్న సన్యాసినాయుడు

అనకాపల్లిటౌన్: బగుడు, బలహీన వర్గాల అనాథ పిల్లలను ఆదుకోవడం ఎంతో సంతృప్తినిస్తుందని గౌరీ పంచాయతన దేవాలయం అధ్యక్షుడు బొడ్డేడ సన్యాసినాయుడు అన్నారు. గవరపాలెం గౌరీపంచాయతన ఆలయంలో పెందుర్తి మండలం వేపగుంట అంధుల పాఠశాలకు చెందిన విద్యార్థులకు ఆదివారం రూ. 30 వేలు విలువ చేసే నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది మహా శివరాత్రి మరుసటి రోజున ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి బుద్ద రమణాజీ, కోశాధికారి కర్రి శివసూర్యనారాయణ, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.